**COMMUNIST PARTY OF INDIA (MARXIST)**
**Telangana State Committee**
M.B.Bhavan, H. No.1-1-60/2, RTC 'X' Roads, Hyderabad -20.
Ph. 040- 27665011 /12, Fax : 27665013, Email-cpimtelangana@gmail.com

ప్రచురణార్థం/ ప్రసారార్థం: తేది: 19.02.2021

# విద్యుత్ చట్ట ముసాయిదాను ఉపసంహరించుకోవాలి
# రైతుసంఘాలకిచ్చిన మాటను నిలబెట్టుకోవాలి

పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన విద్యుత్ చట్ట ముసాయిదాను ఉపసంహరించుకుంటామని రైతుసంఘాల చర్చల సందర్భంగా కేంద్రం ప్రకటించింది. ప్రస్తుతం ఆ చట్టాన్ని మళ్లీ ముందుకు తీసుకొచ్చి రాష్ట్రాలకు, పేదలకు నష్టం చేసి, కార్పొరేట్ సంస్థలకు లాభాలు కట్టబెట్టే విధంగా నరేంద్రమోడీ ప్రకటనలు చేస్తున్నారు. విద్యుత్‌ను మార్కెట్ శక్తులకప్పగించి, కాస్ట్ టు సర్వ్ పద్ధతి తీసుకొచ్చి కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు ప్రధాని మోడీ సిద్ధమయ్యారు. ఈ ప్రకటనను తక్షణమే ఉపసంహరించుకుని రైతుసంఘాలకిచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలని సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తున్నది.

విద్యుత్ వినియోగదారుడు ఎవరినైనా ఎంచుకోవచ్చు, విద్యుత్ రంగంలోకి ఎవరైనా ప్రవేశించొచ్చు అనే మోడీ ప్రకటన చాలా ప్రమాదకరమైనది. రాష్ట్ర ప్రభుత్వాల చేతిలో ఉన్న విద్యుత్ రంగాన్ని పూర్తిగా బలహీనపరచి, తన చేతుల్లోకి తీసుకుని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టాలని కేంద్రం చూస్తున్నది. ఇప్పటికే గుజరాత్‌లోని కొన్ని జిల్లాల్లో విద్యుత్ పంపిణీని బడా పారిశ్రామికవేత్త ఆదానికి కట్టబెట్టింది. ఈ చట్టం వల్ల కార్పొరేట్ల పరిధిలోకి పెద్ద వినియోగదారులు పోతారు. రాష్ట్ర ప్రభుత్వ సంస్థల పరిధిలోకి కేవలం తక్కువ టారీఫ్ ఉన్నవాళ్ళు, ఉచిత వినియోగదారులు, ఇతర రాయితీలు కలిగిన వాళ్ళు మాత్రమే వస్తారు. దీంతో కార్పొరేట్ సంస్థలు లాభాలబాట పట్టి, రాష్ట్ర ప్రభుత్వ విద్యుత్ సంస్థలు దివాళా తీస్తాయి. సబ్సిడీ మరియు నాణ్యమైన విద్యుత్ లేకుండా పోయి, తిరిగి అందరూ ప్రయివేట్ విద్యుత్‌లోకి మారి, ప్రయివేటు సంస్థలు నిర్ణయించిన రేటుకే విద్యుత్‌ను పొందాల్సి ఉంటుంది. పర్యవసానంగా వ్యవసాయానికిచ్చే ఉచిత విద్యుత్, ఎస్సీ-ఎస్టీ కాలనీలకు, పేదలకు ఇచ్చే డొమెస్టిక్ సబ్సిడీ విద్యుత్‌కు ఆటంకాలు ఏర్పడుతాయి.

ఈ చట్టం రైతులకు మరియు ఎస్సీ,ఎస్టీలకు, రాయితీ పొందుతున్న సంస్థలకు, రాష్ట్ర విద్యుత్ సంస్థలకు తీవ్ర నష్టదాయకం. ప్రోత్సాహక పరిశ్రమలకు, ఇతర సంస్థలకు ఇచ్చే విద్యుత్ రాయితీ కూడా రాకుండా పోతోంది. ఇన్ని నష్టాలు కలిగిస్తున్న ఈ విద్యుత్ ముసాయిదాను వెనక్కు తీసుకోవాలని సీపీఐ(ఎం) డిమాండ్ చేస్తున్నది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం కూడా తన అభిప్రాయం చెప్పడంవరకే పరిమితం కాకుండా, దీన్ని ఉపసంహరించుకునేంత వరకు కేంద్రంపై పోరాటం చేయాలని కోరుతున్నది.

**(తమ్మినేని వీరభద్రం)**
రాష్ట్ర కార్యదర్శి